ఆగిపోయిన నాకథ

సాయంకాలం ఐదు గంటలు కావస్తోంది.

ఆఫీసునుంచి ఇంటికి చేరాను.

తలుపు తీసి చిలిపి నవ్వులు నవ్వుతూ చేతిలోని మల్లెమొగ్గలపొట్లం అందుకుంది శ్రీమతి.

డ్రస్ మార్చుకున్నానో లేదో ఒక చేతిలో టిఫెను, ఇంకో చేతిలో కాఫీ కప్పుతో వచ్చింది వయ్యారం వలకబోసుకుంటూ.

"కాస్త కూర్చోనిస్తావా లేదా?" అంటూ అందుకున్నాను. "ఈలోపల శ్రీవారికి కోప వస్తే..." పూర్తిచేయబోతుంటే "శ్రీమతి వారు సేవచేస్తారు" అన్నాను.

"ఏమండీ! కూరలు తెచ్చారండీ"

"తమ రెప్పుడు చెప్పారండీ?"

"అట్లా అనుకుంటారేమండీ! ఆఫీసుకు వెడుతూ మరచిపోతారేమోనని సంచీ కూడా తీసుకువెళ్లారు"

"అవును" అన్నాను గుర్తు చేసుకుని.

"ఇంతకీ సంచీ ఏం చేశారండీ?" ప్రశ్నించింది.

"ఆఫీసులో నా డ్రాయరులో దాచి ఉంటానులే!" అన్నాను.

"అదేం మనుషులండీ మీరు" ఖాళీ ప్లేటు, కప్పు తీసుకువెళ్ళింది.

పేపరు చూస్తున్నాను.

"ఇవాళేమైనా కూరల ప్రాప్తి ఉందా?"

"ఈరోజుకి కాస్త నువ్వు తెచ్చుకో గూడదూ!"

"మరి మీరు తోడు వస్తే..." అంది ఓరకంట చూస్తూ.

"సంచీ ఇలా తే" అని సంచీ తీసుకుని పది అడుగులు నడిచానో, లేదో...

"ఏమండీ, మిమ్మల్నే..."

"మళ్ళీ ఏం మునిగింది?"

పంచదార అయిపోయింది. ఓ వీసె"

'అలాగే', అని పోయి తెచ్చాను.

మరల పేపరు చూస్తున్నాను.

"ఏమండీ! ఏమండీ?" వంట ఇంట్లోనుంచి.

"ఏమిటండీ అంత కంగారు."

"ఇది చూడండీ!"

"ఏమిటండీ అది?"

"ఈ ప్రకటన చూడండీ!" అంటూ తొందర తొందరగా వచ్చింది పంచదార పొట్లం కట్టిన పేపరు చూపించి. నిదానించి చూశాను. అది ఒక వారపత్రిక ప్రకటన......మంచి కథలకు నాలుగు ప్రైజులిస్తామని ప్రకటన...

"మీరు ఒక కథ వ్రాసిపంపరాదటండీ."

"నేనా?...కథా?" అన్నాను అర్థంగాక.

"ఏమిటండీ అలా అంటారు" అంది గునుస్తూ.

"ఎలాగో కష్టపడి వ్రాశానే అనుకో..."

"మీకు తప్పకుండా ఫస్టు ప్రైజు వస్తుంది"

"అలాగా?..." అని పేపరు చూస్తున్నాను...

"మిమ్మల్నే, వ్రాస్తారా, రాయరా?"

"ఓ, అలాగే," అన్నా, బాధ కాస్త తప్పుతుందని.

"ఇదిగో కాగితం, కలం" అంటూ తెచ్చింది.

ముళ్ళపూడి సత్యనారాయణ

"లేడికి లేచిందే పరుగట...అలాగుంది నీ పని...నేనెన్నడైనా కథ వ్రాశానా! అందులో పోటీచేయమంటావు. నీకేమైనా మతిపోయిందా? అదేదో నీవే వ్రాసుకో" అన్నాను మరల పేపరు చూసుకుంటూ.

"సరేలెండి" అంటూ విసవిసా వంటగదిలోకి నడిచింది.

శ్రీమతికి కోపం వచ్చిందని తెలుపుటకై గిన్నెలు, గరిటలు...వగైరా గణగణ మ్రోగుతున్నవి. అయినా ఆ కోటువాడికి బుద్ధి ఉండక్కర్లా! వాడికా పేపరుతప్ప ఇంకేం దొరకలా?

"భోజనానికి లేవమ్మ" సత్యభామ పోజులో.

ఎప్పుడూ కిలకిలానవ్వుతూ ఉండే శ్రీమతికి హఠాత్తుగా ఇంత కోపం ఎలావచ్చిందా అని ఆలోచనలో పడ్డాను...

"వినబడిందా?"

ఉలిక్కిపడి, "ఆ" అంటూ లేచాను.

భోజనం పూర్తిఅయింది. అది కావాలా, ఇది కావాలా, అని ఆమె అడగలేదు. నాకది కావాలని నేనూ పలుకలేదు.

ఆమె భోజనంకూడా పూర్తిఅయింది.

'మేముగూడా నీతో ఏకీభవిస్తా' మంటూ కంచాలు, పీటలు...టపటపమంటున్నవి.

"ఓ భామామణీ! నీ అలుకకు కారణమెయ్యది?" అన్నా తుదకు.

"తమకు సర్వం విదితమే" అంది నొక్కుతూ.

"అదా! అయితే కాగితం, కలం తీసుకురా" అన్నా కోపంపోతుందేమోనని.

అర నిమిషంలో తీసుకు వచ్చిందది.

"ఏమి వ్రాయాలి? ఎలా వ్రాయాలి?" అడిగాను దేవిని. "నే చెబితే మీరు వ్రాస్తా రన్న మాట"

నే మాట్లాడలేదు......

"బి. ఏ. ప్యాసయినారు ... ఒక కథ వ్రాయలేరట..." నసుగుతోంది.

కాగితం, కలం తీసుకున్నాను.

కలం నడవనంటోంది.

"నాకీ రాత్రి గడువియ్యి. ఆలోచించి రేపు ఉదయానికి నీ కోరిక ఈడేర్చగలను..." అన్నాను.

"మీరు ఎంత మంచివారండీ" అంటూ నవ్వింది.

* * *

ఆ మర్నాడు...

"ఏడు గంటలైనా ఇంకా లేవరేమండీ?" లేవకుంటే ఏం ప్రమాదం వాటిల్లుతుందోనని చప్పున లేచి కూర్చొన్నాను.

ముఖప్రక్షాళనం కావించేసరికి కుండు గుడ్డతో వేచి ఉంది శ్రీమతి. తుడుచుకోటం పూర్తి అయేసరికి ఉప్మాప్లేటు, కాఫీ కప్పులతో తారసిల్లింది.

ఈ రోజున ప్రొద్దున్నే టిఫిను ఏమిటో, ఎన్నడూ లేనిది అని ఆలోచిస్తున్నాను.

"చప్పున కానీయండి"

"అలాగే, దేవి!" అంటూ పూర్తిచేశాను. లేజరుసెట్ తీసుకోబోతున్నాను.

కలం, కాగితాలతో ప్రత్యక్షమయింది. గుర్తుకు వచ్చింది—రాత్రి వాగ్దానం. ఈ పూట టిఫెనుకు కారణం. ఏం వ్రాయాలి?

కాగితాలు, కలం తీసుకున్నా, ఇహ దేవి వంటగదికి పోతుందని.

కాని కదలేదు ఆమె. "ఇహ తమరు శెలవు తీసికోండి" అన్నాను.

"మీరు కాగితంమీద అక్షరం పెట్టండి" అంది. ఏం వ్రాయాలి?

★ ఆగిపోయిన నా కథ ★

భగవంతుని పేరు వ్రాస్తే ముక్తి వస్తుందని...అంటే ఆ దేవునివల్ల ముక్తికాదు... ఈ దేవినుంచి ... విముక్తి వస్తుందని "సరస్వతి" అని వ్రాశాను.

దేవి వంటగది ప్రవేశం జరిగింది. నా చేతిలోని కాగితం డ్రాయరుమీద పడింది. కలం జేబులోకి వెళ్లింది. దృష్టిమటుకు వంటింటివైపుంది ఏ క్షణంలో వస్తుందోనని.

పది నిమిషాలు గడచినవి.

శ్రీమతి ఇటువైపు వచ్చే సూచనలు లేవని చేయి రేజరు సెట్ మీద వేశాను.

"మళ్ళీ కదిలారేమండీ?" అంటూవచ్చింది స్నానాదికం నిర్వర్తించుకుని.

ఏం చెప్పాలి? సమయానికి ఓ చిన్న అబద్ధం దొరికింది.

"ఏమీలేదు...పెన్సిలు అరిగిపోయింది చెక్కుకునేందుకు బ్లేడు తీయబోతున్నా" అన్నాను.

"అబద్ధాలాడటంలో కూడా నేర్పుందా అండీ" అంది కొంటెగా నవ్వుతూ.

నాకర్థం కాలేదు.

నా పరిస్థితి గ్రహించి "ఇంకా అర్థం కాలేదా...మీకు డిగ్రీ ఇచ్చిన వాడెవడండీ!" అంది క్రింది పెదవి పంటితో నొక్కుతుని వస్తున్న నవ్వనాపుకొని.

"మీరు పెన్నుతో వ్రాస్తుంటిరి. పెన్సిలు చెక్కాలంటారేమండీ!" అంది.

"ఓ, సారీ..." అంటూ యథాస్థానం ఆక్రమించా దేవి చూడకుండా జేబులో పెన్ను తీసి.

ఎందుకు వ్రాయాలంటే జవాబు దొరుకుతోందిగాని ఏం వ్రాయాలంటే ఏమీ తట్టటం లేదు.

"మీరు వ్రాస్తున్నది కథా, కథానికా లేక స్కెచ్చా" అంది క్రొత్త ఎగ్జామినుచేస్తున్న ధోరణిలో "ముద్దాయి నిర్దోషి" అందా మనుకున్నా. కాని మాట బయటకురాలేదు నాకా మాటకి అర్థం తెలియలేదు. కాని తప్పించుకునేందుకు కథ వ్రాస్తున్నా నన్నాను.

"కామెడీయా, ట్రాజెడీయా?" అంది టాయిలెట్ అవుతూ.

"కామెడీయే" నన్నాను,

"ఎంతవరకు వ్రాశారు?" అంటూ దగ్గరకు రాబోతోంది.

ఇంతలో ఆపద్బాంధవుడిలా నా ఫ్రెండు కృష్ణ గృహప్రవేశం, మాదేవి వంటగది ప్రవేశం ఏకకాలంలో జరిగాయి.

"రక్షించావురా బాబూ!" అని నెమ్మదిగా అనుకొని ఊపిరి పీల్చాను.

ఒక అరగంట వాడేదో బాతాఖానీ "ఇదా సోదారా" అన్నాడు. "కాసేపుండరా!" అన్నా వంటింట్లోకి వినబడకుండా.

"కాదు, పనుంది పోయివస్తా" నన్నాడు కృష్ణ నెమ్మదిగా వాడి చెవిలో ఊది... "బయటపడే మార్గము చూడరా" అన్నా.

"నాకో అరకప్పు కాఫీ, ఓ కాప్సను" అనబోతున్నాడు "నెమ్మదిరా, లోపలకు వినబడుతుంది, అలాగే" అన్నాను.

"కాసేపు కూర్చో, గడ్డంగీసుకున్న పిదప నీ నాటకం మొదలిడుదువుగాని" అని చప్పున గడ్డంగీసుక్కున్నా.

కృష్ణ నాకో దేవదూత. మా శ్రీమతికో యమదూత. "కొద్దిగ పనుంది లోపలకు వస్తారూ!" నన్నగా శ్రీమతి కంఠం వంట గదినుంచి.

"వస్తున్నా..." అని "నీ డ్రామా కానీయ్" అని మా వాడికి చెప్పిలోనికి వెళ్ళాను.

"సమయానికి దాపురించాడు......ఇక ఆయన్ను వెళ్ళమని చెప్పండి." అంది.

'అలాగే' అందా మనుకున్నా. కాని "ఎంత చెడ్డా స్నేహితుడుగదా" అన్నాను.

"నే పోయి చెప్పివస్తా..." అని బయలు దేరబోయింది. "మీ ఆజ్ఞ శిరసావహిస్తా" అన్నాను.

అంతలో "ఏరా! ఎంతసేపురా. అర్జంటుగా మీ ఆఫీసరు నిన్ను రమ్మనమని చెప్పమన్నాడు" అన్నాడు. ముందు గదిలోంచి కృష్ణ.

"ఆఁ వస్తున్నా ఐదు నిమిషాలలో..." అంటూ శ్రీమతి ముఖకవళికలు పరీక్షించక స్నానం ముగించి డ్రస్ వేసికొని "భోంచేయటానికి కివాళ టైము లేదు. హోటలులో తింటా" అని చెప్పాను. ఆవిడతో.

"కథ ఎంతవరకు వ్రాశారూ?" అంది భోజనంమాట వినీ విననట్లు.

"కడపటి ఘట్టంలో ఉంది. ఆఫీసునుంచి వచ్చినపిదప పూర్తిచేస్తా..." అని చల్లగా జారుకున్నా బ్రతుకు జీవుడా అని. నాలుగు అణాలతో మావాడి లంచం చెల్లించా.

ఆ పూట హోటలులో ఎంగిలి పడ్డాను.

సాయంకాలం ఐదుగంటలు కావస్తోంటే నా గుండె వేగం హెచ్చింది.

నా స్నేహితుడు శర్మ ఇంటికి వెళ్ళా ఏదైనా వాడు వ్రాసినకథ అడిగి తీసుకుపోదామని. సమయానికి వాడింట్లో లేడు. ఎనిమిదింటికిగాని రారని తెలిపింది వాడి అర్ధాంగి.

అప్పటివరకు పార్కులో గడిపి ఎనిమిది గంటలకు వాడింటికి వెళ్లాను. వాడిని చూసే సరికి కొంచెం కుదుటబడింది మనసు.

"ఏరా, బ్రదర్, మా ఆవిడ ఏదైనా కథ వ్రాయమని ఒకటే గోలచేస్తోంది. ఏం వ్రాసేందుకు కుదరటంలేదు. నువ్వు వ్రాసింది. అచ్చుకాని దొకటి తగలెయ్. అది కాపీ చేసి ఆవిడకు సమర్పించుకుంటా" అన్నాను వాడితో.

"ఓ, దానికేం" అంటూ ఒక కట్ట తెచ్చాడు ఏదో ఒకటి తీసుకోమని.

ఒకటి తీసుకుని జాగ్రత్తగా పాంటు జేబులో దాచి ఇంటికి చేరాను.

"ఇప్పటికి ఇల్లు కనబడిందిగావున్ను" అంటూ తలుపులు తీసింది.

భోజనం పూర్తిచేశాను.

"ఆ కథ పూర్తిచేస్తారా?" అంది. ఏదో ఆలోచిస్తున్నా.

"రేపు సాయంకాలం పోస్టుచేస్తే ఎల్లుండి అంటే గడువుతేది కదటికి చేరుతుంది... ఈ పూట పూర్తిచేసి రేపు తప్పక పంపించండీ..." అంది.

"తమరు విశ్రమించండి" అంటూ టేబుల్ ముందు కూర్చున్నాను, వస్తూ తెచ్చిన ఆనెల భారతి శ్రీమతికిచ్చి. భారతిలో ఐక్యమయింది దేవి- నేను చకచకా కాపీ చేయటం పూర్తిచేశాను ఆటంకం లేకుండా.

'చూడండి' అని నే కాపీచేసినది చూపించాను. శర్మ వ్రాసినది డ్రాయరులో ఉంది.

భారతి అచట పారేసి గబాలున వచ్చి చదివింది ఉత్సాహంగా గటిగా ఊపిరి పీల్చాను.



స్కినెడెక్స్
గజ్జి, దురదలు, పుండ్లు మొ॥
చర్మవ్యాధులకు దివ్యాంజనము
శ్రీవత్స కెమికల్స్ & డ్రగ్స్
లిమిటెడ్, మద్రాసు-30.

"ఇదేమిటండీ! మీరు కామెడీ వ్రాస్తున్నానని చెప్పి ట్రాజెడీ వ్రాశారు" అంది. అపుడు గుర్తుకువచ్చింది ఉదయం ఆమెతో కామెడీ మాడువంతులు పూర్తయింది అన్నమాట.

"ట్రాజెడీ అయితే బాగుంటుందని" అన్నానని ఉత్సాహం తెచ్చిపెట్టుకొని.

"బాగుందండి మీ తెలివి... ఓం ప్రథమంగా కథ వ్రాశారు. అందులో పోటీకి పంపుతున్నారు. అది ట్రాజెడీ అయితే... ఇంకేం... పెళ్ళికి వెడుతూ పిల్లిని చంక పెట్టుకు వెళ్ళినట్లుంటుంది..." అంటోంది ఏకధాటిగా.

"ఇదా అసి మంచినీళ్ళు పుచ్చుకోండి... దాన్ని కామెడీ చేస్తా ఇలాతే" అన్నా.

"ఊ" అని మరల భారతిలో మునిగింది శ్రీమతి నేను చాల బాధపడ్డా. ట్రాజడీను కామెడీ ఎలా చేయుటమా? అని.

అదృష్టవశాత్తు నిద్రాదేవి మా దేవిని వరించింది.

* * *

ఆ మర్నాడు...

"లేవండీ! ఆరు దాటింది"

"ఊ" అని పసిగా నిద్రమత్తుతో

"కాఫీ చల్లారిపోతోంది లెద్దురూ!" జాలిగా.

"సరే" అని లేచి ఒళ్ళు విరుచుకుని పనులు పూర్తి చేసుకున్నాను.

వేడివేడి ఇడెన్లప్లేటు, కాఫీలతో ప్రత్యక్షమయింది దేవి.

అవి ఆరగించాను...

"కథ ఓసారి చదివిస్తా ఇలా తెండీ" అంది.

ఏంచేయాలి?

"రాత్రి ఆ కథను మార్చలేదు. ఈపూట"

"అవునులెండి. పనిపిల్లలాగా... కాసేపుకను మూశానో లేదో గోక ముడిచారు..." అంది

"ఒకగంటలో పూర్తిచేస్తా, నీపని నువు చేసుకో అన్నా కాస్త విశ్రాంతి వసుందని.

"నిన్నటలాగా ఎవరన్నా నిక్షేపరాయుడు వస్తే సందుచూస్తారు. మీరు తలుపు వేసుకుని వంటగదిలో కూర్చొని వ్రాయండి. ఎవరన్నా వస్తే లేరని నే చెబుతా" అంది.

"ధంపావురో!" అందామనుకున్నా. కాని గొంతుక పూడిపోయింది.

కాగితాలు ముందరేసికొని వంటగదిలో తైరాయించాను.

ఐదు నిమిషాలు గడచినవి.

శ్రీమతి స్నానం పూర్తిచేసింది.

కథ మార్చడం నే నింకా మొదలిడలేదు. శ్రీమతి చూసినపుడల్లా ఏదో వ్రాస్తున్నట్లు నటించేవాడిని.

"మూర్తి ఉన్నాడండీ?" బయటనుంచి కృష్ణ కేక.

తలుపు తీద్దామని వెళ్ళబోతున్నా.

"తమరలా కూర్చోండి" అంది అర్ధాంగి గదిలోకిపోతూ.

"లేరండీ, బజారుకు వెళ్ళారు" కాని శ్రీమతి కోపగృహము అలంకరిస్తుందేమోనని ఏమీ ఎరగనట్లు కూర్చొన్నా.

మొన్న చూసిన సినిమా కథ గుర్తుకు తెచ్చుకుని దానిలోని కామిడీని దీనిలో ఇరికించి ఎలా అయితేనేం పూర్తిచేసాను.

"భోంచేద్దురు గాని లేవండి" అంది.

పూర్తిచేశాను. భోజనం. దేవిగూడ పనులు పూర్తిచేసుకుని రాగానే "నాకథ సమర్పించా" ఇష్టదైవాన్ని ప్రార్థించుకుని.

అంతా శ్రద్ధగా చదివి చివరకు "ళ్ప" అంది పట్టులేదంటూ.

"ఏదో మొదటికథ" (తుదికథా అనుకోండి) నసిగాను.

"సరే, పంపండి" అంది ఉపాధ్యాయిని ఫోజులో.

"చిత్తం" అన్నాను శిష్యునిలా.

టైము చూశాను. పండ్రెండు గంటలయింది. కాసేపు నడుం వాల్చాను. ఒకగంట కునుకు తీశానో లేదో "వెళ్లి పోస్టుచేసి రద్దురూ!" అని లేపింది.

సరేనని రిక్షామీద పోస్టాఫీసుకు చేరాను. తొందర తొందరగా స్టాంపుల క్లర్కు దగరకు వెళ్లాను. తలుపులేసి ఉన్నవి ఆ పోస్టాఫీసులో ఒకడూ కనిపించలేదు.

పరికించి చూశాను. తాళం వేసిఉంది. అప్పుడు గుర్తుకువచ్చింది ఆ రోజు ఆదివారం అని.

"అవును లేకుంటే నే నీ రోజు ఇంట్లో ఎందుకున్నా" అని నాలో నేను ప్రశ్నించుకుని కాళ్లీడ్చుకుంటూ ఇంటికి చేరాను.

"అదేమిటండీ! కథ తిరిగి తెచ్చారేమండీ?" అంది ఆశ్చర్యపోతూ.

"నీ తెలివి తెల్లారినట్టే ఉంది. ఇవాళ ఆదివారం సెలవు. లేకుంటే ఇంట్లో నే నెలా ఉంటాను? వెళ్ళు...వెళ్ళు...నిద్ర పాడు చేసావు. పైగా మూడు రోజులనుంచీ నా దుంపతెంచావు అన్నా కోపంగా.

"తెలిసుండి మరెందుకు వెళ్లారు?" అంది.

నీవు వెళ్లమన్నావని" అని తప్పు ఆవిడ మీదకు తోశాను.

"చివరకి పని చేశారా, ఇంతా కథరాసి" అంది అమాయకంగా.

"నీకో మంచిమాట చెబుతా వింటావా?" అన్నాను.

"చెప్పండి" అంది.

"కాఫీ కాచావా"

"లేదు."

"ఈ కాగితాలతో కుంపటి వెలిగించు" అన్నాను అవి ఆమెకిచ్చి.

"ఏమిటండీ, ఆ పాడుమాటలు. ఓం ప్రథమంగా వ్రాసినదాన్ని ఇలాచేస్తారా" అంది.

లేకుంటే నువ్వు పంపించుకోగాని నేనుటుకు ఇంకే పత్రికకు పంపదలచుకోలేదు" అన్నాను.

"అంతే నంటారా!" అంది.

"అవును" అన్నాను.

"మూర్తి ఉన్నారండీ!" బయటనుంచి కృష్ణ.

"ఆ, వస్తున్నా..."...అంతే.

నా కథ ఆగిపోయింది......

ఆ మీదట ఆమె నాటికి నేటికి కథ వ్రాయమనలేదు... ★